భారత్ జయకేతనం

కాన్పూర్ టెస్టులో సంచలన విజయం • 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ • బంగ్లాకు తప్పని భంగపాటు

చివరి రోజు అదరగొట్టిన బౌలర్లు • ఛేదనలో దంచేసిన యశస్వీ, విరాట్ కోహ్లీ

రెండున్నర రోజుల ఆట తుడిచిపెట్టుకు పోయినా ఒక టెస్టులో మరో సగం రోజు మిగిలుండగానే విజయం సాధించొచ్చని ఎవరైనా ఊహించారా? ఆరు సెషన్లు మాత్రమే సాగిన మ్యాచ్‌లో ఫలితం రాబట్టొచ్చని ఎవరైనా అంచనా వేశారా? ఓ జట్టు 52 ఓవర్లలోనే టెస్టును గెలుచుకోవడం ఎప్పుడైనా చూశారా? కానీ కాన్పూర్‌లో భారత క్రికెట్ జట్టు ఆ అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసింది. తొలి రోజు 35 ఓవర్ల ఆటే సాధ్యమై తర్వాత రెండ్రోజుల్లో ఒక్క బంతీ పడకపోయినా నాలుగో రోజు అనూహ్య ఆటతీరుతో మ్యాచ్‌ను తమ వైపునకు లాగేసుకున్న టీమ్‌ఇండియా.. ఆట చివరి రోజు అసాధారణ ఆటతీరుతోఅద్భుతమే చేసింది. నాలుగో రోజు ప్రత్యర్థి జట్టుకు బ్యాట్‌తో చుక్కలు చూపించిన రోహిత్ సేన.. మంగళవారం బంతితో ఆటాడుకుంది. వీలైనంత త్వరగా బంగ్లాను ఆలౌట్ చేయాలన్న కసితో ఆడిన భారత్‌కు బుమ్రా, జడ్డూ రాణించడంతో తిరుగులేకుండా పోయింది. ఆ తర్వాత పర్యాటక జట్టు నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని 17 ఓవర్లలోనే ఊదిపారేసి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయడమే గాక స్వదేశంలో వరుసగా 18వ టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది.

కాన్పూర్: అద్భుతం.. అసాధారణం.. అపూర్వం.. కాన్పూర్ టెస్టులో భారత ప్రదర్శన గురించి చెప్పడానికి ఇలాంటి ఉపమానాలెన్ని వాడినా సరిపోదు. వర్షం, ఇతరత్రా కారణాల రీత్యా రెండున్నర రోజుల ఆట కోల్పోయిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. ఐదో రోజు మరో సెషన్ మిగిలుండగానే సగర్వంగా విజయాన్ని ముద్దాడింది. ఆట చివరి రోజు బంగ్లాదేశ్ నిర్దేశించిన 95 పరుగుల ఛేదనను 17.2 ఓవర్లలోనే పూర్తిచేసింది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (45 బంతుల్లో 51, 8 ఫోర్లు, 1 సిక్సర్), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 29 నాటౌట్, 4 ఫోర్లు) వేగంగా ఆడారు. అంతకుముందు భారత బౌలర్లు చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 47 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ షద్మన్ ఇస్లాం (50) అర్ధ సెంచరీతో ఆదుకోగా ముష్ఫీకర్ రహీమ్ (37) ఫర్వాలేదనిపించాడు. బుమ్రా (3/17), జడేజా (3/34), అశ్విన్ (3/50) తలా మూడు వికెట్లతో పర్యాటక జట్టు వెన్ను విరిచారు. మ్యాచ్‌లో రెండు అర్ధ సెంచరీలు చేసిన యశస్వీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆసాంతం రాణించిన రవిచంద్రన్ అశ్విన్‌ను 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' వరించింది.

బుమ్రా, జడ్డూ ధాటికి బెంబేలు..

చివరి రోజు ప్రత్యర్థిని త్వరగా ఆలౌట్ చేయాలనే ఏకైక లక్ష్యంతో బరిలోకి దిగిన రోహిత్ సేన మూడో ఓవర్లోనే అందుకు శ్రీకారం చుట్టింది. ఓవర్ నైట్ స్కోరు 26/2 వద్ద ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. ఫస్ట్ ఇన్నింగ్స్ సెంచరీ హీరో మొమినుల్ హక్ (2) వికెట్‌ను త్వరగా కోల్పోయింది. అశ్విన్ వేసిన బంతిని స్వీప్ చేయబోయిన అతడు.. లెగ్ స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. అయితే కెప్టెన్ శాంతో (19) తో కలిసి షద్మన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు యత్నం చేశాడు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 55 పరుగులు జతచేసింది. కానీ డ్రింక్స్ తర్వాత రెండో ఓవర్‌లో జడేజా.. అద్భుతమైన బంతితో శాంతోను బోల్తా కొట్టించాడు. రివర్స్ స్వీప్ ఆడబోయిన శాంతో బంతి మిస్ అవడంతో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న షద్మన్‌ను ఆ మరుసటి ఓవర్లోనే ఆకాశ్‌దీప్ పెవిలియన్‌కు పంపాడు. లిటన్ దాస్ (1), షకిబ్ సైతం జడ్డూ మాయాజాలానికి బలయ్యారు. మిరాజ్‌ను బుమ్రా ఔట్ చేయడంతో బంగ్లా ఆశలు వదులుకుంది. లంచ్ విరామానికి వెళ్లేముందు బుమ్రా వేసిన 46వ ఓవర్ చివరి బంతికి ముష్ఫీకర్ కూడా బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది.

యశస్వీ దూకుడు..

బంగ్లా నిర్దేశించిన 95 పరుగుల ఛేదనను భారత్ ధాటిగానే మొదలుపెట్టింది. యశస్వీ రెండో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. కానీ రోహిత్ (8), శుభ్‌మన్ గిల్ (6) నిరాశపరిచారు. ఈ ఇద్దరూ మిరాజ్ బౌలింగ్‌లో ఔటయ్యారు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కోహ్లీతో కలిసి యశస్వీ భారత్‌ను లక్ష్యం వైపునకు నడిపించాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 58 పరుగులు జోడించింది. తైజుల్ ఇస్లాం బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఫిఫ్టీకి చేరువైన యశస్వీ.. అతడే వేసిన 16వ ఓవర్‌లో సింగిల్ తీసి ఈ మ్యాచ్‌లో రెండో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ భారత విజయానికి 4 పరుగుల దూరంలో ఉండగా భారీ షాట్ ఆడబోయి షకిబ్ అల్ హసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. కోహ్లీతో కలిసి పంత్ (4 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లా తొలి ఇన్నింగ్స్ : 233 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్ : 285/9 డిక్లేర్డ్
బంగ్లా రెండో ఇన్నింగ్స్ : 146 ఆలౌట్ (షద్మాన్ 50, ముష్ఫీకర్ 37, బుమ్రా 3/17, జడేజా 3/34)
భారత్ రెండో ఇన్నింగ్స్: 98/3 (యశస్వీ 51, కోహ్లీ 29 నాటౌట్, మిరాజ్ 2/44)

స్వదేశంలో అజేయం

భారత్‌కు ఇది వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయం.
ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలో ఏ జట్టుకూ ఈ రికార్డు లేదు. 2012 తర్వాత టీమ్‌ఇండియా సొంతగడ్డపై ఒక్క టెస్టు సిరీస్ కూడా కోల్పోలేదు. చివరిసారిగా 2012-13లో ఇంగ్లండ్ చేతిలో ఓడాక గడిచిన 12 ఏండ్లలో ఒకటీ, అరా టెస్టు మ్యాచ్‌లు ఓడటం మినహా సిరీస్‌లు కోల్పోయిన దాఖలాల్లేవు. ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ జట్లకూ ఈ ఘనత లేదు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (10 టెస్టు సిరీస్‌లు- 1994-2000 దాకా, 2004-2008 దాకా), వెస్టిండీస్ (8, 1976-1986) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సుమారుగా 4,300 రోజులకు పైగా భారత్ స్వదేశంలో అజేయంగా కొనసాగుతోంది. 2013 నుంచి సొంతగడ్డపై 53 టెస్టులు ఆడిన మెన్ ఇన్ బ్లూ.. ఏకంగా 42 మ్యాచ్‌లలో గెలిచి 4 టెస్టులను మాత్రమే కోల్పోయింది. ఏడు డ్రాగా తేలాయి.

1 టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఓ జట్టు అత్యధిక రన్‌రేట్ (7.36 భారత్) నమోదు చేయడం ఇదే ప్రథమం.

1 టెస్టులలో ఒక్క మెయిడిన్ కూడా లేకుండా గెలిచిన జట్టు భారత్. రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఒక్క బంగ్లా బౌలర్ కూడా మెయిడిన్ ఓవర్ వేయలేదు.

4 ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక టెస్టు విజయాలు సాధించిన జట్లలో భారత్ (180) నాలుగో స్థానంలో ఉంది. ఆసీస్, ఇంగ్లండ్, విండీస్ మనకంటే ముందున్నాయి.

11 టెస్టుల్లో అశ్విన్ సాధించిన ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌లు. ఈ క్రమంలో అతడు మురళీధరన్ (శ్రీలంక)ను సమం చేశాడు.

డబ్ల్యూటీసీ బాటలో

బంగ్లాదేశ్‌తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ రేసుకు భారత్ మరింత చేరువైంది. ఈ విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా.. 74.24 శాతంతో అగ్ర స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ సైకిల్‌లో మరో 8 మ్యాచ్‌లు (స్వదేశంలో న్యూజిలాండ్‌తో 3, ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 5) ఆడనున్న రోహిత్ సేన.. మూడింటిలో గెలిచినా వరుసగా మూడో సారి ఫైనల్స్ ఆడుతుంది.

పార్థ్ పసిడి జోరు

• భారత్ పతక మోత

లిమా (పెరూ): ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ పార్థ్ రాకేశ్ మనె రెండు స్వర్ణాలు నెగ్గాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పసిడి నెగ్గిన పార్థ్.. ఇదే విభాగంలోని టీమ్ ఈవెంట్‌లోనూ స్వర్ణం గెలిచాడు. వ్యక్తిగత ఫైనల్‌లో అతడు 250.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అజయ్ మాలిక్, అభినవ్ షాతో కలిసి టీమ్ ఈవెంట్‌లో పాల్గొన్న పార్థ్.. 1883.5 పాయింట్లతో మరో స్వర్ణాన్ని కొల్లగొట్టాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో భారత బృందం గౌతమి, సంభవి, అనోష్క త్రయం 1883.5 పాయింట్లతో తొలిస్థానంలో నిలిచి పసిడిని ముద్దాడింది. ఇదే విభాగంలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి, అజయ్ ద్వయం కాంస్యంతో మెరిసింది. ఈ టోర్నీలో భారత్ 5 స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలు దక్కించుకుని పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచింది.

తిలక్ కెప్టెన్సీలో..

రంజీ టోర్నీకి హైదరాబాద్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రానున్న రంజీ ట్రోఫీ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సీనియర్ సెలెక్షన్ కమిటీ జట్టును ప్రకటించింది. మంగళవారం సమావేశమైన కమిటీ చైర్మన్, సెలెక్టర్లు టోర్నీ తొలి రెండు మ్యాచ్‌లకు(హైదరాబాద్, డెహ్రాడూన్) జట్టును ఎంపిక చేశారు. 15 మందితో కూడిన టీమ్‌కు యువ బ్యాటర్ తిలక్‌వర్మ కెప్టెన్‌గా, రాహుల్ సింగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. వీరితో పాటు మిలింద్, తన్మయ్‌అగర్వాల్, రోహిత్‌రాయుడు, తనయ్ త్యాగరాజన్, అనికేత్‌రెడ్డి, నితేశ్, అభిరాత్, హిమతేజ, రాహుల్, రక్షణ్‌రెడ్డి, కార్తీకేయ, సరను నిశాంత్, ధీరజ్‌గౌడ్ జట్టులో చోటు దక్కించుకున్నారు. హైదరాబాద్ జట్టుకు వినీత్ సక్సేనా చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

వామప్‌లో భారత్ విజయం

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతున్నది. ఇప్పటికే వెస్టిండీస్‌పై విజయం సాధించిన టీమ్‌ఇండియా..మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మరో వామప్‌లో28 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత రీచా ఘోష్(36), దీప్తిశర్మ(35 నాటౌట్), రోడ్రిగ్స్(30) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో144/7 స్కోరు చేసింది. ఓపెనర్ షెఫాలీవర్మ(0) డకౌట్‌తో నిరాశపర్చగా, మందన(21) ఫర్వాలేదనిపించింది. కాకా(5/25) ఐదు వికెట్లతో విజృంభించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సఫారీలు 20 ఓవర్లలో 116/6 స్కోరుకు పరిమితమయ్యారు. కెప్టెన్ లారా వోల్వార్ట్(29), కోల్ ట్రయాన్(24) మినహా పెద్దగా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. ఆశా శోభన(2/21) రెండు వికెట్లు తీసింది.

ఫైనల్లో సిన్నర్ X అల్కారజ్

బీజింగ్: టెన్నిస్ యువ సంచలనాలు జన్నిక్ సిన్నర్ (ఇటలీ), కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) చైనా ఓపెన్ టెన్నిస్ ఫైనల్‌లో ముఖాముఖి తలపడనున్నారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ అల్కారజ్.. 7-5, 6-3తో డేనియల్ మెద్వెదెవ్ (రష్యా)ను వరుస సెట్లలో ఓడించి ఫైనల్స్ చేరాడు. మరో సెమీస్‌లో ఒకటో సీడ్ సిన్నర్.. 6-3, 7-3(7/3)తో యుంచవోకెటె బు (చైనా)ను చిత్తుచేశాడు. ఈ ఇద్దరూ గతంలో 9 సార్లు తలపడగా అల్కారజ్ 5 మ్యాచ్‌లు గెలవగా సిన్నర్ నాలుగింటిలో గెలిచాడు.

రాణించిన రహానే, సర్ఫరాజ్

లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై జట్టు తొలి రోజు నిలకడగా ఆడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న ముంబై.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (86 బ్యాటింగ్), సర్ఫరాజ్ ఖాన్ (54 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్ (57) అర్ధ సెంచరీతో మెరిశాడు.

నిలకడగా రజనీ ఆరోగ్యం

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అనారోగ్యానికి లోనయ్యారు అనే వార్త దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను కలవరానికి గురిచేసింది. సోషల్ మీడియా ద్వారా రజనీ కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు కూడా పెడుతున్నారు. సోమవారం రాత్రి తీవ్ర కడుపునొప్పితో రజనీ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు హృదయ నాళంలో సమస్యను గుర్తించి, రజనీకి స్టెంట్ వేశారు. మంగళవారం ఉదయం ఆస్పత్రి వర్గాలు రజనీకాంత్ ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ని విడుదల చేశాయి. హృదయ నాళానికి సంబంధించిన చికిత్స చేసినట్టు ఈ బులెటిన్‌లో వారు వెల్లడించారు. రజనీ ఆరోగ్యం నిలకడగానే ఉందనీ, మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని వారు బులెటిన్ ద్వారా పేర్కొన్నారు. మరోవైపు ఈ విషయంపై రజనీకాంత్ భార్య లత కూడా స్పందించారు. రజనీకాంత్ ఆరోగ్యం మెరుగుపడిందని, నిలకడగానే ఉన్నారని అభిమానులకు ఆమె తెలియజేశారు. రజనీకాంత్ నటించిన 'వెట్టయాన్' సినిమా ఈ నెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిగాక 'కూలీ' అనే సినిమా కూడా చేస్తున్నారాయన.

షరతులు లేని ప్రేమకు దర్పణం

'కె.బాలచందర్, కె.విశ్వనాథ్, దాసరి, కమల్‌హాసన్ లాంటి గొప్ప వారికి మనం థాంక్స్ చెప్పుకోవాలి. ఎందుకంటే.. చిన్నప్పుడే ఈ తరహా సినిమాలను మనకు వారు చూపించేశారు. ఈ కైండ్ ఆఫ్ సినిమాను మన లోపల పెట్టారు. ఇలాంటి ఎమోషన్స్‌ని మిస్ అవుతున్నామని, మళ్లీ ఆ ఎమోషన్స్‌ని తీసుకొచ్చారని అందరూ అంటుంటే చాలా ఆనందంగా ఉంది. షరతులు లేని ప్రేమను తెరపై ఆవిష్కరించిన డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌ని అభినందించకుండా ఉండలేకపోతున్నా' అని హీరో కార్తీ అన్నారు. ఆయనా, అరవింద స్వామి లీడ్ రోల్స్ చేసిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో జ్యోతిక, సూర్య నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో గత నెల 28న విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఇంకా దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్, హీరోయిన్ శ్రీదివ్య, రచయిత రాకేందుమౌళి కూడా మాట్లాడారు.

ఛాలెంజ్‌గా తీసుకొని చేశా

'ఈ సినిమాకు ముందు 'స్వాగనిక వంశానికి సుస్వాగతం' అని టైటిల్ పెట్టాలనుకున్నాం. యూత్ పలకడానికి ఇబ్బందిపడతారని 'స్వాగ్' అని పేరు పెట్టాం. ఇది ఒక వంశానికి చెందిన కథ. 1500వ సంవత్సరంలో కథ మొదలవుతుంది. స్త్రీ గొప్పా? పురుషుడు గొప్పా? అనే అంశంపై టిట్ ఫర్ టాట్ లాంటి అంశాలతో కథ నడుస్తుంది. కొత్త కథ చెబితే ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఆయన హీరోగా రూపొందిన ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో శ్రీవిష్ణు విలేకరులతో ముచ్చటించారు. 'నేను డ్యూయల్ రోల్స్ ఇప్పటివరకూ చేయలేదు. ఈ సినిమాలో నాలుగు పాత్రలు చేశాను. ఒకే పోలికతో ఉన్న నాలుగు జనరేషన్స్ వ్యక్తులుగా కనిపిస్తా. ఛాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్రలు చేశా. యూత్‌కే కాక, పెద్దవాళ్లకూ నచ్చే సినిమా ఇది. రెండున్నర గంటల్లో ఇంతపెద్ద కథ చెప్పారా? అంటూ సినిమా చూశాక దర్శకుడ్ని అభినందిస్తారు. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ది టాప్ ఫిల్మ్ 'స్వాగ్'' అని తెలిపారు శ్రీవిష్ణు. కథానాయిక రీతూవర్మ ఇందులో కొత్తగా కనిపిస్తుందని, మీరాజాస్మిన్ అద్భుతంగా నటించారని, సినిమా చూస్తున్నంతసేపు నటులు కనిపించరని, పాత్రలే కనిపిస్తాయని, అందరికీ అర్థమయ్యేలా స్క్రీన్‌ప్లే ఉంటుందని, వివేక్‌సాగర్ మ్యూజిక్ బ్రేజీ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని శ్రీవిష్ణు తెలిపారు. ఈ సినిమా తర్వాత ఓ థ్రిల్లర్ సినిమా, గీతా ఆర్ట్స్‌లో ఓ కామెడీ సినిమా చేస్తున్నామని శ్రీవిష్ణు చెప్పారు.

మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి

ప్రియాంక చోప్రా తనవారందరికీ ఓ ఫొటో ఛాలెంజ్ విసిరింది. తొమ్మిదేండ్ల వయసులో ఉన్న తన ఫొటోకు, 17ఏండ్ల వయసులో తాను మిస్ వరల్డ్ గెలుచుకున్న నాటి ఫొటోను జత చేసి తన ఇన్‌స్టాలో షేర్ చేసింది ప్రియాంక. 'ఈ ఫొటోల్లో ఒకటి నా తొమ్మిదేండ్ల నాటి ఫొటో. క్రాఫ్‌తో అబ్బాయిలా ఉన్నాను. స్కూల్లో చదువుతున్న రోజులవి. రెండోది నేను మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన నాటి ఫొటో. అప్పటికి నా వయసు 17ఏండ్లు. ఆ రోజులు ఇప్పటికీ జ్ఞాపకమే. అప్పుడప్పుడే జీవితంలో స్థిరపడుతున్న క్షణాలవి. వెనక్కి తిరిగి చూసుకుంటే నా జీవితంలో సంభవించిన మార్పులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మీకు మీరే స్ఫూర్తి. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడి ఉంటాం. ఆ స్ఫూర్తే నేటికీ మనల్ని ముందుకు నడిపిస్తుంది. మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీ చిన్ననాటి ఫొటోకి రీసెంట్ ఫొటోతో పోలుస్తూ కామెంట్స్ పెట్టండి.. ' అంటూ ప్రియాంక అభిమానుల్ని కోరింది.

'కాంతార' ప్రీక్వెల్‌లో మోహన్‌లాల్

రిషబ్‌శెట్టి హీరోగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అపూర్వ విజయాన్ని సాధించింది. డివోషనల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార-1' తెరకెక్కుతున్నది. 'కాంతార'కు ముందు జరిగే కథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ కీలక పాత్రలో నటించనున్నారని తెలిసింది. ఇందులో ఆయన హీరో రిషబ్‌శెట్టి తండ్రి పాత్రలో కనిపిస్తారని అంటున్నారు. గత ఏప్రిల్‌లో మోహన్‌లాల్‌ను ఆయన స్వగృహంలో కలుసుకున్నారు రిషబ్‌శెట్టి. ఆ సమయంలోనే వారిమధ్య ప్రీక్వెల్‌కు సంబంధించిన చర్చలు జరిగాయని చెబుతున్నారు. 'కాంతార-1'లో మోహన్‌లాల్ నటించడానికి అంగీకరించారని, త్వరలో ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం. 70వ జాతీయ చలన చిత్ర అవార్డులో 'కాంతార' ఉత్తమ జనరంజక చిత్రంగా నిలిచిన విషయం తెలిసిందే.

జీరో సే రీస్టార్ట్

విధు వినోద్‌చోప్రా దర్శకత్వంలో రూపొందిన '12th ఫెయిల్' చిత్రానికి అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయి. పేదరికాన్ని జయించి ఐపీఎస్ సాధించిన మనోజ్‌కుమార్ శర్మ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విక్రాంత్ మస్సే, మేధా శంకర్ ప్రధాన పాత్రల్ని పోషించారు. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ చిత్రాన్ని వీక్షించి అభినందించారు. తాజాగా ఈ సినిమాకు ప్రీక్వెల్‌ను తెరకెక్కించబోతున్నట్లు దర్శకుడు విధు వినోద్‌చోప్రా తెలిపారు. 'జీరో సే రీస్టార్ట్' పేరుతో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నామని, '12th ఫెయిల్'లోని తారాగణమంతా భాగమవుతున్నారని ఆయన వెల్లడించారు. అబుదాబిలో జరుగుతున్న 'ఐఫా' చిత్రోత్సవంలో పాల్గొన్న ఆయన ప్రీక్వెల్ తాలూకు విశేషాలను వెల్లడించారు. మనోజ్‌కుమార్ శర్మ బాల్యం మొదలుకొని అతని కాలేజీ రోజుల వరకు సాగే జీవిత ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నామని పేర్కొన్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభించి రెండు నెలల్లో చిత్రాన్ని పూర్తి చేస్తామని, డిసెంబర్ 13న విడుదల చేస్తామని విధు వినోద్‌చోప్రా తెలిపారు.

భిన్నమైన నాలుగు అవతారాల్లో

చిత్రం



మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో వరుణ్‌తేజ్ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మట్కా' ఒకటి. కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నది. నవంబర్ 14న థియేటర్లలో సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సెకండ్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. వరుణ్ ఈ పోస్టర్‌లో రెట్రో అవతార్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లపై నడుస్తూ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. 1958 నుంచి 1982 వరకూ అంటే.. 24ఏండ్ల పాటు సాగే పీరియాడిక్ డ్రామా ఇదని, ఇందులో వరుణ్ నాలుగు విభిన్న రూపాల్లో కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్‌రెడ్డి, తీగల, రజనీ తాళ్లూరి, నిర్మాణం: వైర ఎంటర్టైన్మెంట్స్, ఎస్‌ఆర్‌టీ ఎంటర్టైన్మెంట్స్.

గోవిందాకు బుల్లెట్ గాయాలు

ప్రమాదవశాత్తు తుపాకీ పేలిన ఘటనలో బాలీవుడ్ నటుడు గోవిందా తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం ముంబయిలోని ఆయన స్వగృహంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను కప్‌బోర్డ్‌లో పెడుతుండగా ట్రిగ్గర్ ప్రెస్ కావడంతో బుల్లెట్ మెకాలిలోకి దూసుకెళ్లింది. వెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు దగ్గరలోని క్రిటీ కేర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం గోవిందా ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కోల్‌కతాలో జరిగే ఓ షోలో పాల్గొనేందుకు గోవిందా మంగళవారం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరేముందు, తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను పరీక్షిస్తుండగా ఈ ఘటన జరిగిందని గోవిందా మేనేజర్ మీడియాకు తెలిపారు. 'తన్‌బదన్' (1986)చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన గోవిందా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి కమర్షియల్ హీరోగా గుర్తింపు పొందారు. గత ఐదేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్నారు గోవిందా. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన శివసేన పార్టీలో చేరారు.

కృతిసనన్ డ్యూయల్ రోల్

బాలీవుడ్ కథానాయిక కృతిసనన్ 'దో పట్టి' చిత్రంతో నిర్మాతగా మారుతున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె సీనియర్ నటి కాజోల్‌తో కలిసి నటిస్తున్నది. కవలలైన అక్కాచెల్లెళ్ల కథతో మర్డర్ మిస్టరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శశాంక చతుర్వేది దర్శకుడు. నటి కనికా ధిల్లాన్ ఈ చిత్రానికి కథనందించింది. ఈ సినిమాలో కృతిసనన్ ద్విపాత్రాభినయంలో నటిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఆమె డ్యూయల్ రోల్‌ను పోషిస్తుండటం విశేషం. నిర్మాతగా తన తొలి ప్రాజెక్ట్ కాబట్టి ఈ సినిమాపై కృతిసనన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదట. ఉత్తరాఖండ్‌లోని ఓ